ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.8

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

గురువారం 23 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	52,560	52,560
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.42 (4.31)	1,517.58	1,764.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.548)	25,230	24,230

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250





డీ సీసీ

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక ఏకపక్షమంటూ ఫిర్యాదులు
- ఎంపికలో ఎమ్మెల్యేలే కీలకమా?
- ప్రస్తుతం కొనసాగుతున్న అధ్యక్షుడికి మరో అవకాశం ఎలా ఇస్తారని విమర్శలు
- అభిప్రాయ సేకరణలో ఏఐసీసీ నిబంధనలు బేఖాతరంటున్న పార్టీ శ్రేణులు
- సోషల్ మీడియా వేదికగా విమర్శల వార్

జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడి ఎన్నికపై ఏఐసీసీ పరిశీలకులు అభిప్రాయ సేకరణ చేస్తుండగా, ఈ ప్రక్రియ ఏకపక్షంగా జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న డీసీసీ అధ్యక్షుడికి మరో అవకాశం కల్పించేలా పార్టీలోని ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని శ్రేణుల్లో చర్చ సాగుతోంది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

ఏఐసీసీ పరిశీలకులు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఎమ్మెల్యేలు, నియోజవర్గ పార్టీ బాధ్యులు, బ్లాక్, పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నేతల అభిప్రాయాలను తీసుకుంటున్నారు. అధ్యక్ష పదవి కోసం జిల్లాలో చాలా మంది సీనియర్ నేతలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లాలో ఎన్ని దరఖాస్తులు వచ్చినా, టీపీసీసీకి మాత్రం ఆరుగురు అభ్యర్థులతో కూడిన జాబితాను ఏఐసీసీ పరిశీలకులు నివేదించాలి. వీరిలో ఒక మహిళతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, ఓసీలతో అభ్యర్థుల జాబితాను అధిష్ఠానానికి పంపనున్నారు. అయితే ఈ ఆరుగురిపై జిల్లాలోని నియోజకవర్గాల వర్గాల వారీగా అభిప్రాయ సేకరణ పూర్తి కావొచ్చింది. ఏఐసీసీ నిబంధనల ప్రకారం డీసీసీ అధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్న వారికి రెండోసారి అవకాశం ఇవ్వకూడదు. ఈ విషయంపై అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన కూడా జారీ చేసింది. డీసీసీ పదవిని చేపట్టే నేతలకు ఏఐసీసీ అధిష్ఠానం కొన్ని అర్హతలు, నిబంధనలు విధించింది. జిల్లాల్లో ప్రజాప్రతినిధుల బంధువులు, ఇప్పటివరకు, ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వకూడదు. కనీసం ఐదేళ్ల పాటు నిరంతరాయంగా పార్టీలో క్రమశిక్షణతో పనిచేసిన వారు అర్హులుగా నిర్ణయించింది. అయితే ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి కూడా మరోసారి అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. అయితే ఏఐసీసీ నిబంధనల ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న డీసీసీ అధ్యక్షుడికి దరఖాస్తు చేసుకునే మరో ఛాన్స్ ఎలా ఇస్తారని? ఆయన ఎంపికపై ఏఐసీసీ పరిశీలకులు నిబంధనలు ఉల్లంఘించి ఏ విధంగా అభిప్రాయ సేకరణ చేపడతారని పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తుతం కొనసాగుతున్న అధ్యక్షుడినే కొనసాగించేలా ప్రయత్నాలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏఐసీసీ మార్గదర్శకాల మేరకు పార్టీలోని సీనియర్ నేతలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని, ప్రస్తుతం కొనసాగుతూ, పార్టీలోని అందరితో సమన్వయం లేని వారికి అవకాశం ఎలా ఇస్తారని పలువురు సీనియర్ నేతలు టీపీసీసీ అగ్రనేతల దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. డీసీసీ ఎంపికపై జిల్లాలోని సీనియర్ నేతల అభిప్రాయాల మేరకు చేపట్టాలని కోరుతున్నారు. ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్ మాత్రం డీసీసీ ఎన్నిక కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అభిప్రాయ సేకరణ చేపడుతున్నామని చెబుతున్నారు. అయితే పార్టీలోని సీనియర్ నేతల అభిప్రాయాలను గౌరవించి, ఏఐసీసీ నిబంధనల మేరకు డీసీసీని ఎంపిక చేస్తారా? లేక స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన వ్యక్తికి పగ్గాలు అప్పగిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఎమ్మెల్యేలే కీలకమా?

ఏఐసీసీ ఈసారి డీసీసీ అధ్యక్షుడితో పాటు జిల్లాకార్యవర్గం

మిగతా 8వ పేజీలో...

సోషల్ మీడియాలో వార్

డీసీసీ ఎంపిక వ్యవహారంపై సోషల్ మీడియాలో వార్ కొనసాగుతోంది. పార్టీలో ఎవరు సీనియర్, క్రమశిక్షణ కలిగిన నేతలెవరు, పార్టీలు మారిన వారెవరని తీవ్రంగా చర్చ సాగుతోంది. సోషల్ మీడియా వేదికగా పార్టీలోని సీనియర్ నేతలకు పట్టం కట్టాలని కోరుతూ పోస్టులు పెడుతున్నారు. ఫలానా వ్యక్తికి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తే పార్టీలో సీనియర్లను సమన్వయం చేస్తారని, ప్రస్తుతం కొనసాగుతున్న డీసీసీ అధ్యక్షుడిని ఎట్టి పరిస్థితుల్లో ఎంపిక చేయవద్దని పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక వ్యవహారంలో సోషల్ మీడియాలో పలువురు నేతల మధ్య తీవ్రంగా పోరు జరుగుతోంది. జిల్లాలో అన్ని అర్హతలు ఉండి, అందరిని సమన్వయంచేసే నేతలకే డీసీసీ పీఠాన్ని అప్పగించాలని, బంధుప్రీతి, పక్షపాతం లేకుండా ఏఐసీసీ జాగ్రత్తలు తీసుకుని ఎంపిక చేయాలని కోరుతున్నారు. చివరికి అధిష్ఠానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో చూడాల్సిందే.



● కార్తీకం ప్రారంభం



కార్తీక మాసం పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా గణపతి పూజ, అఖండ దీపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆలయాల్లో కార్తీక మాసం పూజలు కొనసాగనున్నాయి.

7

● గిరి ప్రదక్షిణం



యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

7

రైతులు పండించే ప్రతీగింజను కొంటాం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



జంగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని జంగంపల్లి, దాతరుపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని, ఇప్పటికే రుణమాఫీ చేశారని, రైతు భరోసా వేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వారంలోపు రైతుల ఖాతాలో డబ్బులు జమఅవుతాయని, డబ్బులు రావడం లేదని ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, డైరెక్టర్ శివరాత్రి దానయ్య, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, నాయకులు కాల్నే భాస్కర్, బత్తిని రాజుగౌడ్, బత్తిని కృష్ణగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, తహసీల్దార్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



రైస్ మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన పౌర సరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని రైస్ మిల్లర్లందరూ అగ్రిమెంట్లు, బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలన్నారు. వానాకాలం 2024-25 సీఎంఆర్ డెలివరీ 91 శాతం పూర్తి అయిందని, మిగిలిన సీఎంఆర్ లక్ష్యాన్ని మిల్లర్లు నిర్ణీత గడువులోగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మెగావత్ రోజారాణి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ దాచేపల్లి హరిక్రిష్ణ, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

గుర్తింపు పత్రాలుంటేనే అద్దెకు ఇవ్వాలి



వలస కార్మికుల నివాసాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తింపుకార్డులు ఉన్న వలస కార్మికులకే ఇల్లు అద్దెకు ఇవ్వాలని భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్ అన్నారు. వలస కార్మికుల నివాసాల్లో బుధవారం భువనగిరి పట్టణ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కార్మికుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. అద్దెకు ఉంటున్న వలస కార్మికుల వివరాలను యజమానులు ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలన్నారు. వలస కార్మికులు పనులకు మాత్రమే పరిమితం కావాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- మాతృ మరణాలను అరికట్టాలి
- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పక్కన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఎంహెచ్‌వో మనోహర్

భువనగిరి(కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో మాతృ మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మాతృ మరణాలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గర్భిణీగా నమోదైన నాటినుంచి వైద్యులు, సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ఏఎన్ఎం, ఆశాలు వారి వద్దకు వెళ్లి అవసరమైన మందులు, టీకాలు వేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు, జిల్లా వైద్యాధికారి మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, డీసీహెచ్ఎస్ చిన్నానాయక్, పలు వైద్య నిపుణులు, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సమాజంలో ఎంపీడీవోల పాత్ర కీలకం

సమాజంలో ఎంపీడీవోల పాత్ర కీలకమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ట్రైనీ ఎంపీడీవోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవచేయడంలో ఎంపీడీవోల పాత్ర కీలకమన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఎంపీడీవోలు గ్రామ పంచాయతీలబాట

బీబీనగర్: గ్రూప్ -1 ద్వారా కొత్తగా నియమితులైన ఎంపీడీవోలు పంచాయతీల బాట పట్టారు. విధుల్లో చేరిన ఎంపీడీవోలకు పంచాయతీలపాలన పని తీరుపై ప్రభుత్వం అవగాహన కల్పిస్తుంది. ఇందులో భాగంగా నూతన ఎంపీడీవోలు 50మంది బుధవారం బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు క్షేత్రపర్యటన చేపట్టారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, ఏపీడీ జి.సురేశ్, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీవోలు మాజిద్, వినూత్న, రాఖేశ్ పాల్గొన్నారు.

రామన్నపేట: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రామన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ లాల్ బహదూర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జరీనా ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు

ధాన్యం కొనుగోలులో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. రామన్నపేట మండల దుబ్బాక, మునిపంపుల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, మాజీ ఎంపీటీసీ మాడురి జ్యోతి, ఏఈవో వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి



కోటమర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండలంలోని ధర్మారంలో రూ.కోటితో ప్రాథమిక పాఠశాలల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మోత్కూరు మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ, ఇటికాల చిరంజీవి, బాలెంల సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మందుల సామేలు అన్నారు.

అడ్డగూడూరు మండలంలోని ధర్మారం, చౌళ్లరామారం, కోటమర్తి, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు ప్రభాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పత్తి పంట సాగు చేసిన రైతులు కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆలేరు వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని టంగుటూరి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. పత్తి విక్రయాలకు కపాస్ కిసాన్ యాప్‌పై యాప్ తప్పనిసరిని అన్నారు. యాప్‌లో రైతులు పత్తిపంట విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో భార్గవి, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సదుపాయాలు కల్పించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవిలత



బీబీనగర్ బీసీ బాలికల వసతి గృహంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవిలత

బీబీనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత అన్నారు. బుధవారం బీబీనగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, వసతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతులు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులను సొంత పిల్లలుగా భావించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు.

రామన్నపేట: మండల పరిధిలోని జనంపల్లి పాఠశాల, మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో వంటలను పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ సభ్యులు బత్తుల గణేష్, నగేష్, పాఠశాల, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొమరం భీమ్ ఆశయాలను సాధించాలి

మోత్కూరు అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి) ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలపై పోరాడిన కొమరం భీమ్ ఆశయ సాధనకోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం కొమరం భీమ్ 124వ జయంతి సందర్భంగా శ్రీకాంత్ చౌరస్తా వద్ద రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీమ్ చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, లెంకల వేణు, వడకాల దయాకర్, సంగిశెట్టి రూబెన్, ఎర్రవెల్లి నాగేశ్వర్, కాంతయ్య, కిరణ్, సాదిక్‌పాషా, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలేవీ?

● శిథిల భవనాలు, ఇరుకు గదులనుంచే పాలన ● కొన్నింటికి శంకుస్థాపన ● నేటికీ ప్రారంభం కాని పనులు

8

ఆహ్లాదం.. అజిలాపురం బుగ్గజలపాతం

ఎత్తయిన కొండల నుంచి జాలువారుతున్న జలపాతం. వాటి మధ్య పరుచుకున్న ప్రకృతి పచ్చదనం, చల్లటి గాలులు, పక్షుల కిలకిల రావాలతో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం అజిలాపురం బుగ్గజలపాతం పర్యాటకులను మైమరిపిస్తోంది. గ్రామశివారులోని 2500 ఎకరాల్లోని అడవిలో అడుగడుగునా ప్రకృతి రమణీయతే కనిపిస్తుంది.

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)



జలధార వద్ద పర్యాటకులు

మర్రిగూడ మండలం అజిలాపురం గ్రామ శివారులో 2500 ఎకరాల్లో విస్తరించి ఉన్న అడవులు వానాకాలంలో పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చుట్టూ ఉన్న కొండలపై నుంచి జాలువారే నీరు జలపాతాలను తలపిస్తున్నాయి. వర్షాలు బాగా కురిస్తే ఆరు నెలల పాటు ఈ జలపాతాలు కనులవిందు చేస్తుంటాయి. ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు జలధారగా ఎత్తయిన కొండచరియల మీద నుంచి దూకుతూ కనువిందు చేస్తున్నాయి. ఈ మనోహర దృశ్యాలను చూసేందుకు వివిధప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం ఇక్కడికి వస్తున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి బుగ్గజలపాతంలో తడిసి ముద్దవుతున్నారు. ఇక్కడే వంటా వార్పు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదం మధ్య సేదతీరుతున్నారు.

రెండు కిలోమీటర్ల కాలినడక

దూరప్రాంతాల నుంచి బుగ్గజలపాతాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు అక్కడే కొలువుదీరిన బుగ్గ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తోంది. దేవాలయం పక్కనే వాహనాలు నిలిపి బుగ్గ జలపాతాన్ని చూసేందుకు కాలిబాటలో రెండు కిలోమీటర్ల మేర కొండచరియల వెంట పచ్చనిచెట్ల మధ్య ప్రకృతిఅందాలను ఆస్వాదిస్తూ నడవడం పర్యాటకులకు సంతృప్తిని ఇస్తోంది.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



బుగ్గజలపాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఎత్తయిన కొండల మధ్య జారువారుతున్న నీటిప్రవాహాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే అభివృద్ధి చెందుతుంది.

చందునాయక్, సామాజిక కార్యకర్త



జాలువారుతున్న బుగ్గ జలపాతం

మరణించినా మరొకరిలో జీవిస్తూ..

● నార్కట్‌పల్లి యువకుడి బ్రెయిన్‌డెడ్ ● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



శ్రీహర్షయాదవ్ (ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువకుడు బ్రెయిన్‌డెడ్ కాగా, కుటుంబ సభ్యులు అతడి అవయవాలు దానంచేసి ఆదర్శంగా నిలిచారు. భౌతికంగా లేకున్నా మరొకరి రూపంలో బతికే ఉంటాడని జీవన్‌దాన్ ట్రస్ట్ నిర్వాహకుల సూచనల మేరకు యువకుడి కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. నార్కట్‌పల్లికి చెందిన నడింపల్లి బలరాంసత్తయ్య, హేమలతల కుమారుడు శ్రీహర్షయాదవ్(21) రంగారెడ్డి జిల్లా బాటసింగారం సమీపంలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 18వ తేదీన కళాశాల ముగిసిన అనంతరం ఇంటికి బయలుదేరే క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమైన శ్రీహర్షయాదవ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, బ్రెయిన్‌డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. నాలుగు రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచిన కుటుంబసభ్యులు, వైద్యుల సూచన మేరకు మంగళవారం తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. శ్రీహర్ష గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలను ఆయా ఆసుపత్రుల వారికి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. అనంతరం గౌరవ సూచకంగా వందన సమర్పణ చేసి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య శ్రీహర్ష యాదవ్ అంత్యక్రియలు బుధవారం నార్కట్‌పల్లిలో ముగిశాయి.

కొబ్బరికాయల ధరలకు రెక్కలు

● కార్తీకమాసం కావడంతో డిమాండ్

● రూ.35 నుంచి రూ.45 పలుకుతున్న ధరలు

● భక్తులకు తప్పని తిప్పలు

పూజల్లో వినియోగించే ప్రధానమైన కొబ్బరికాయల ధరలకు రెక్కలొచ్చాయి. అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నిత్యం ఆరాధనలు, పూజలు కొనసాగుతాయి. ఆలయాలు, క్షేత్రాలను భక్తులు విరివిగా దర్శించుకుంటారు. ఈ సమయంలో కొబ్బరి కాయలకు డిమాండ్ మరింతగా ఉంటుంది. అయితే కొద్దికాలంగా వాటి ధరలు పెరిగిపోయాయి. గతంలో రూ.20లు పలికే కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు పలుకుతోంది.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)



కార్తీకమాసంలో వేకువజామునే దేవతారాధన ప్రధానంగా ఉంటుంది. ఇంట్లో పూజలతో పాటు భక్తులు తరుచూ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఆలయాలు, క్షేత్రాల్లో సైతం ఈ మాసాంతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పూజల్లో ప్రధానంగా వినియోగించే కొబ్బరికాయల ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరికాయలను పత్రం, పుష్పం, ఫలం తోయంగా భావిస్తుంటారు. దీంతో ఈ మాసంలో మంచి డిమాండ్ ఉంటుంది.

పూజలకు ప్రత్యేక మాసం

కార్తీకమాసం పూజలకు, దైవరాధనలకు ప్రత్యేకం. శివుడికి ఇష్టమైన మాసాల్లో కార్తీక మాసం ఒకటి. దీంతో ఈ మాసంలో ఉపవాసాలతో పాటు పూజలు చేస్తుంటారు. అదేవిధంగా అయ్యప్ప, ఆంజనేయస్వామి, శివభక్తుల మాలాధారణ చేస్తుంటారు. మండలం పాటు(40 రోజులు) చేపట్టే దీక్షను ఈ మాసంలోనే చాలామంది ప్రారంభిస్తారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంటుంది. డిసెంబరులో శబరిమలలో జరిగే ప్రత్యేక పూజలకు హాజరయ్యే భక్తులు ఈ మాసంలోనే మాలధారణ చేస్తుంటారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిస్తుంటాయి.

పెరిగిన డిమాండ్.. తగ్గిన దిగుబడి

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలానికి గతంలో వారానికి రెండు లారీల కొబ్బరికాయలు సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం వారానికి ఒక లారీని మాత్రమే సరఫరా చేస్తున్నారని స్థానిక వ్యాపారులు తెలుపుతున్నారు. అయితే కొద్దికాలంగా పంట దిగుబడి లేకపోవడం, ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో కొబ్బరికాయల ధరలకు డిమాండ్ పెరిగింది. సరఫరా అయిన కొబ్బరికాయలు కూడా చిన్నవిగా ఉంటున్నాయని, కేవలం ఐదు రోజుల వరకు మాత్రమే నిల్వ ఉంటున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో రూ.20లు పలికిన కొబ్బరికాయ ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులు సిండికేట్ కావడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.



ధరలు కొండెక్కాయి



నిత్యం మా ఇంట్లో పూజలు చేసి అనంతరం దేవాలయాలకు వెళ్తంటా. ఆలయానికి వెళ్లాలంటే పసుపు, కుంకుమ పువ్వులు, పండ్లు, కొబ్బరికాయతో వెళ్లి పూజలు చేస్తుంటా. నెల రోజుల క్రితం రూ.20 ఉన్న కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.40కి చేరింది. గ్రామీణప్రాంతాల్లో రూ.40 నుంచి 45 వరకు విక్రయిస్తున్నారు. దిగుమతి చేసిన కొబ్బరికాయులు చిన్నవిగా ఉండటంతో వెంటనే కుళ్లిపోతున్నాయి.

కొండూరి శ్రీదేవి, మాజీ సర్పంచి (గొడకొండ్ల).

యువకుడి ఆత్మహత్య

రాజాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడిచెరువు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన కర్రె కనుకయ్య వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు కాగా ముగ్గురు కుమారులు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉండగా 13ఏళ్ల కిందట ఆమె మృతి చెందింది. మొదటి భార్య పెద్దకుమారుడు మహేష్(22) తండ్రికి వ్యవసాయంలో సాయంగా ఉంటున్నాడు. కనుకయ్య తల్లి పెంటమ్మ ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు రోజుల కిందట ఆర్‌వీఎం ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం తండ్రి, కుమారుడు కనుకయ్య, మహేష్‌లు ఇంటికి వచ్చారు. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో గదిలో మహేష్ ఉరివేసుకున్నాడు. బుధవారం గది తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మహేష్ మృతికి సంబంధించి ఎవరిపై అనుమానం లేదని తండ్రి కనుకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ఎపిక్ ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు



సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసగాళ్లు వాట్సాప్ గ్రూపుల్లో నకిలీ ఎపిక్ ఫైల్స్‌ను పంపి మోసాలకు పాల్పడుతున్నారని, ఆ తరహా వాట్సాప్ మెసేజ్‌లను ప్రజలు డౌన్‌లోడ్ చేయవద్దని సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఎపిక్ ఫైల్స్‌ను ఆర్‌టీవో, టీఎస్ చలాన్ యాప్‌లు వంటి వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేయడం వల్ల సెల్‌ఫోన్లు హ్యాక్‌కు గురై సైబర్ మోసం జరుగుతోందన్నారు. ఎవరైనా ఈ ఫైల్స్‌ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసినప్పుడు, హానికరమైన సాఫ్ట్‌వేర్ ద్వారా హ్యాక్‌కు గురై బాధితుడికి తెలియకుండా, అనుమతి లేకుండా మోసగాళ్లకు ఓటీపీ సందేశాలతో ఆటోమేటిక్ మెసేజ్ ఫార్వర్డ్‌ను అనుమతిస్తోందన్నారు. ఈ పద్ధతి ద్వారా సైబర్ నేరగాళ్లు బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా డబ్బును దొంగిలిస్తున్నారని ప్రకటనలో వివరించారు. అందుకోసం నకిలీ ఆర్‌టీవో చలాన్ యాప్‌లు, పీఎం కిసాన్ ఏపీకేలు, ఎస్‌బీఐ యోనో, కస్టమర్ కేర్ యాప్‌లు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న ఏమైనా ఇతర అనుమానాస్పద ఎపిక్ ఫైల్స్ వంటి వాటి వివరాలను వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ప్రజలు ఏవైనా మోసపూరిత యాప్స్‌ను గుర్తిస్తే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

రామన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జరిగింది. రామన్నపేటలోని బీసీ కాలనీకి చెందిన రైతు మోటె రాజుకు సొంత వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ పశుపోషణ చేస్తూ రాజు జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం ఆవును మేతకు వదలగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 60వేల విలువైన ఎదకు వచ్చిన ఆవు మృతి చెందడంతో రైతు రాజు కన్నీటి పర్యంతమయ్యాడు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని బోట్యాతండా పంచాయతీ పరిధికి చెందిన భూక్యా టీక్యాకు చెందిన గొర్రెలపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆరు గొర్రెలు మృతి చెందడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. మరికొన్ని గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. టీక్యాను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అప్పుపత్రాల కోసం మద్యం తాగించి వృద్ధురాలి హత్య



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 14న వృద్ధురాలి హత్య కేసును హుజూర్‌నగర్ పోలీసులు ఛేదించారు. బంగారు ఆభరణాలు, అప్పు పత్రాల కోసం మద్యం తాపించి మత్తులోకి వెళ్లాక వృద్ధురాలిని హత్య చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వఆస్పత్రి వెనుక నివసిస్తున్న చెన్న అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు. ఓ కుమారుడు నకిరేకల్‌లో ఉంటుండగా, ఆమెతో పాటు ఉండే కుమారుడు వేణు వారణాసిలో వంటలు చేయడానికి వెళ్లాడు. అనసూర్యమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదిలా ఉండగా ఇదే పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన సుతారీ పని చేసే లింగం సతీష్‌కు ఆమె గతంలో రూ.50 వేలు ఇవ్వగా అతడు వడ్డీ చెల్లిస్తున్నాడు. ఈ నెల 14 రాత్రి సమయంలో సతీష్ అతడి మేనల్లుడు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రాంతానికి చెందిన మైనర్‌తో అనసూర్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమెకు మద్యం ఇచ్చి, అది సేవించి మత్తులోకి వెళ్లాక ఇద్దరు కలిసి అనసూర్యమ్మ నోరు, ముక్కు మూసి హత్యచేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లో భద్రపరిచిన సతీష్ రాసిఇచ్చిన రూ.50వేల తాలుకూ ప్రామిసరీ నోటును తీసుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత జరిగిన విషయాన్ని సతీష్ తన భార్య మౌనికకు తెలిపాడు. నిందితులు ముగ్గురు కలిసి చోరీచేసిన బంగారు ఆభరణాలను విజయవాడకు తీసుకెళ్లి అక్కడ కరిగించి బంగారు ముద్దలుగా మార్చుకుని భద్రపర్చుకున్నారు. ఈ నెల 15న ఉదయం అనసూర్యమ్మ నిద్రలేవకపోయేసరికి స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. దీంతో హుజూర్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనసూర్యమ్మ మృతికి కారణాలను తెలుసుకుని, ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించారు. అనసూర్యమ్మ శరీరంపై గాయం ఉండడం, ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు లేకపోవడంతో హత్యగా నిర్ధారించుకున్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాల ప్రకారం లింగం సతీష్, అతడి భార్య మౌనిక, మేనల్లుడైన మైనర్ బాలుడిపై అనుమానంతో విచారించగా అనసూర్యమ్మను హత్య చేసింది తామేనని అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.60లక్షల విలువ చేసే బంగారు ముద్దలు, అప్పుకు సంబంధించిన ప్రామిసరీ నోటును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. బాలుడిని కోర్టు అనుమతితో జువైనల్ హోంకు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, శంభయ్య ఉన్నారు.

సరిహద్దులోని ఆర్టీఏ చెక్‌పోస్టుల మూసివేత

● ఉమ్మడి నల్లగొండలో మూడు చోట్ల చెక్‌పోస్టులు

● రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాల మేరకేనంటూ ఫ్లెక్సీల ఏర్పాటు



నాగార్జునసాగర్‌లో చెక్‌పోస్టును ఎత్తివేస్తున్నట్లు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ, నల్లగొండకు తరలిస్తున్న సామాగ్రి

కోదాడ రూరల్ / నాగార్జునసాగర్ / దామరచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీఏ చెక్‌పోస్టులను బుధవారం నుంచి మూసివేశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని 15 చెక్‌పోస్టులను మూసివేయాలని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ వద్ద ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టును మూసివేసి ఇక్కడ ఉన్న కార్యాలయ సామాగ్రిని ఆటోలో నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఇతరరాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే ట్రాన్స్‌పోర్ట్ వాహనాల చలాన్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా దామరచర్ల మండలం వద్ద ఉన్న చెక్‌పోస్టును మూసివేసి ఫర్నీచర్‌ను, సామాగ్రిని జిల్లా కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం రవాణాలావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎంవీఐ సతీష్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టునూ మూసివేశారు. ఇక్కడి సామాగ్రిని, రికార్డులు, ఫర్నీచర్, కంప్యూటర్లను నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా తెలంగాణరాష్ట్రం ఏర్పాటైన ఏడాదిన్నర తర్వాత అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతరరాష్ట్రాలకు చెందిన వాహనాలు తెలంగాణలోకి రావాలంటే ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ చెల్లించే ట్యాక్స్‌లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనూ చెల్లించే విధానం తీసుకువచ్చింది. దీంతో చెక్‌పోస్టులను ఎత్తివేత తప్పలేదని అధికారులు తెలిపారు.

బాలాజీనాయక్ ఏజెంట్లలో మొదలైన అలజడి

● ప్రత్యక్షచర్యలకు దిగుతున్న బాధితులు

● బాలాజీనాయక్ కంటే మధునాయక్‌పైనే ఫిర్యాదులు ఎక్కువ

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికవడ్డీకి ఆశపడి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలానికి చెందిన రమావత్ బాలాజీనాయక్, మధునాయక్ ఉదంతంలో ఏజెంట్లలో అలజడి మొదలైంది. వడ్డీ విషయం బయటకు చెప్పవద్దని, చెబితే డబ్బులు రావని ద్వితీయశ్రేణి ఏజెంట్లు బాధితులను బెదిరించేవారు. దీంతో బాధితులు వెనుకడుగు వేశారు.ఇటీవల బాలాజీనాయక్‌తో పాటు మధునాయక్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించడంతో బాధితులు ఒక్కొక్కరూ గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా మరికొందరు ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు. ఏజెంట్ల ఇళ్ల వద్దకు, ఆస్తులు ఎక్కడ ఉన్నాయో ఆరా తీసి వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఏజెంట్లలో అలజడి మొదలైంది. ఇన్నిరోజులు బాలాజీనాయక్, మధునాయక్‌ను నమ్ముకుని ఉన్న ఏజెంట్లు ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. అంతేకాకుండా బాలాజీనాయక్, మధునాయక్ దగ్గర తర్ఫీదు పొందిన ఏజెంట్లు వారి కంటే అధిక వడ్డీలు ఇస్తామని జనాలను మోసం చేసినట్లు తెలుస్తోంది. అమాయక ప్రజల వద్ద డబ్బులు తీసుకున్న ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకుంటే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి ఎన్ని కోట్లు తీసుకున్నారో తెలుస్తుందని బాధితులు వేడుకుంటున్నారు. బాధితులకు ప్రామిసరీ నోట్లపై అవగాహన లేకపోవడంతో ఏజెంట్లకు వరంలా మారింది. బాధితులకు ఎన్ని రూ.కోట్లు అయినా ఒక్క ప్రామిసరీ నోట్‌పైనే రాసి ఇచ్చారు.

వీటి ఆధారంగా న్యాయం చేయడం పోలీసులకు సవాల్ మారింది. ఇదిలా ఉండగా రోజురోజుకు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి ఏజెంట్లపై ఫిర్యాదులు అందుతున్నా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనే విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

వివాహేతర సంబంధం నెరుపుతుందనే హత్య

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొరివి బిక్షమమ్మ వివాహేతర సంబంధం నెరుపుతుందన్న కారణంగానే హత్య చేసినట్లు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంలో ఇటీవల పంచాయితీ జరిగిందని, అయినప్పటికీ ఆమెలో మార్పు రాకపోవడంతో అవమానంగా భావించి పథకం ప్రకారం కారుతో ఢీకొట్టి కత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. భిక్షమమ్మ సోదరుడు గుండాల నర్సయ్య ఫిర్యాదుమేరకు భిక్షమమ్మ భర్త కొరివి మల్లయ్యతో పాటు చిన్నకుమారుడు ప్రవీణ్, అన్న కుమారుడు మహేష్, అతడి మిత్రులు వంశీ, జనార్ధన్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రిలో భిక్షమమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపూరు గ్రామంలో ఆమె పెద్దకుమారుడు భరత్ అంత్యక్రియలు నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సెలూన్ దుకాణం దగ్ధం



దగ్ధమైన సెలూన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో హెయిర్‌కటింగ్(సెలూన్) దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. సీఐ యాలాద్రి, దుకాణ యజమాని బొప్పాపురం కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన కృష్ణయ్య ఆలేరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అద్దె గదిలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం దుకాణానికి సెలవు ఉండడంతో తెరవలేదు. రాత్రి సమయంలో దుకాణం లోపల నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు కృష్ణయ్యకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను చల్లార్చారు. అప్పటికే కుర్చీలు, సోఫాలు, హెయిర్‌కటింగ్ సామాగ్రి కాలిబూడిదయ్యాయి. ఘటనా స్థలాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎజాజ్ బుధవారం సందర్శించి, కృష్ణయ్యను పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఫోన్‌లో వివరించారు. ప్రభుత్వం నుంచి పరిహారానికి కృషి చేస్తానని తెలిపారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాలాద్రి తెలిపారు.

విడి సిమెంట్ విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు

చిట్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్యాంకర్ల నుంచి సిమెంట్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం చిట్యాల భువనగిరి రోడ్డులో విడి(బస్తాల్లో కాకుండా) సిమెంట్ వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. సిమెంట్ బ్రిక్స్ వ్యాపారి గుండాల శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. అక్కడే షెడ్‌లో ఉన్న 83బస్తాల లూజ్ సిమెంట్ బ్యాగులను శ్రీను నిల్వ చేసినట్టు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అదేవిధంగా మిగిలిన నలుగురికి కలిపి రూ.4 వేల జరిమానా విధించారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ప్రమాదాలకు దారితీస్తాయన్నారు.

రూ.1.22 కోట్లతో పర్వతరావు చెరువు పునరుద్ధరణ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పర్వతరావు చెరువు పునరుద్ధరణ పనుల కోసం రూ.1.22 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు బుధవారం నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు.

ఫిట్‌నెస్ మంత్రం.. ఆరోగ్యం పదిలం



వ్యాయామశాలను మరింతగా అందుబాటులోకి తీసుకొస్తాం

పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ షటిల్‌కోర్టుకు సైతం మంచి ఆదరణ ఉంది. పబ్లిక్‌క్లబ్ సేవలు ఉపయోగించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఆనందంగా ఉంది. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

- కొప్పుల వేణారెడ్డి, పబ్లిక్‌క్లబ్ సెక్రెటరీ



వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో సౌకర్యాలు బాగున్నాయి. వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ అరగంటకు పైగా వ్యాయామం చేస్తే మంచింది. వ్యాయామశాలను ఉపయోగించుకుంటున్నాను.

- డాక్టర్ మురళిమోహన్, సూర్యాపేట



ఉదయం, సాయంత్రం కసరత్తు

ఉదయం, సాయంత్రం వ్యాయామశాలలోనే ఉంటున్నాను. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. పబ్లిక్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాయామశాలలో సౌకర్యాలు బాగానే ఉన్నాయి. జిమ్‌లో కావాల్సిన శిక్షణను వివరిస్తున్నారు.

- భీష్మారెడ్డి, సూర్యాపేట

ఆరోగ్యానికి ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యం. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. గతంలో ఐదు పదుల వయస్సు దాటితేనే ఆరోగ్య సమస్యలు వచ్చేవనుకునే వారు. కానీ ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే ముప్పు వచ్చే ప్రమాదముంది. ప్రస్తుతం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యకర జీవితాన్ని ఆస్వాదించాలి.

- ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్

» ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై అశ్రద్ధ » ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చెమటోడుస్తున్న వైనం
» ఐదు పదుల వయస్సులో ఉత్సాహంగా కసరత్తు » యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సూర్యాపేట వాసులు



ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేకమంది ప్రతిరోజూ వ్యాయామం, జిమ్ సెంటర్లలో కసరత్తు చేస్తున్నారు. ఐదు పదులు వయస్సు దాటిన వారు జిమ్ సెంటర్‌లో కసరత్తు చేస్తూ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటున్నారు. జిమ్‌లో గంటకు పైగా వ్యాయామం చేస్తూ దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉదయం నిద్రలేచింది మొదలు గంట నుంచి గంటన్నర వరకు జిమ్‌లోనే కసరత్తు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో ఐదు పదులు దాటిన సుమారు 60 మంది ఆరోగ్యం కోసం చెమటోడుస్తున్నారు. యువత జిమ్‌కు కూడా జిమ్‌లకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

పబ్లిక్ క్లబ్‌లో కసరత్తులు

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో మూడు సంవత్సరాల క్రితం వ్యాయామశాలను ప్రారంభించారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు, తిరిగి సాయత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు 60మంది 50 సంవత్సరాలకు పైబడిన వారు కసరత్తు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వీరిలో 50 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. శరీరాకృతిని, బరువును తగ్గించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వ్యాయామం వీరి దినచర్యలో భాగమైంది.



వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామం

అనారోగ్య సమస్యలకు చెక్‌పెట్టేలా జిమ్ ఉపయోగపడుతుంది. పబ్లిక్‌క్లబ్‌లో వ్యాయామశాల ఏర్పాటు చేసినప్పటి నుంచీ ఇక్కడికి వస్తున్నాను. మంచి వాతావరణం ఉంది.

- వెంకటరెడ్డి, సూర్యాపేట



ధృడమైన శరీరం జిమ్‌తో సాధ్యం

జిమ్‌లో కసరత్తులతో ధృడమైన శరీరం ఏర్పడుతుంది. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామంతో శరీరం అందమైన ఆకృతిలో వస్తుంది. ఇటీవల పలు పోటీల్లో పాల్గొన్నాను. యువత జిమ్‌కు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- రామూర్తి, సూర్యాపేట



జిమ్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. వ్యాయామంతో డ్రగ్స్‌ను దూరం చేసుకునే అవకాశం ఉం ది. డ్రగ్స్‌తో అనార్యోగానికి గురికావాల్సిందే. సుమారు 60మందికి శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది.

- ప్రసాద్, శిక్షకుడు, సూర్యాపేట.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

హుజూర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శివలింగాకారాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6గంటల సమయంలో సూర్యకిరణాలు పడగా సుమారు 10 నిమిషాలపాటు శివలింగంపై కిరణాలు ప్రకాశించాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ శివాలయాన్ని 12 సంవత్సరాల క్రితం పునర్ నిర్మించారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా కార్తీకమాసం 30 రోజులు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతుండడం గమనార్హం. ఎంతో చారిత్రాత్మక మహత్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో సూర్యకిరణాలు పడుతున్న సమయంలో రుద్రాభిషేకం చేస్తున్నట్లు అర్చకులు గుంటిపల్లి రవీంద్రాచార్యులు తెలిపారు. ఎంతో ప్రాచుర్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో కార్తీకమాసంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



శివలింగంపై ప్రకాశిస్తున్న సూర్యకిరణాలు

ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన

నల్లగొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫ్రాంక్లిన్ టెక్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో బుధవారం నిర్వహించిప ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 220 మంది అభ్యర్థులు హాజరుకాగా 70 మందిని జాబితాలో చేర్చినట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి తెలిపారు. ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ఉద్యోగ నియామకాల కోసం జరిగిన కార్యక్రమంలో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు శేఖర్, సత్యనారాయణరెడ్డి, వెంకట్, ఫ్రాంక్లిన్ టెక్ సీఈవో ఆర్. శివకుమార్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు వేణు, ప్రతాప్, దివ్య, పృధ్వి, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో రెండు రోజులుగా సాధారణ స్థితిలో ఉంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 15 రోజులకు పైగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసి వేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రానికి 1767.22 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 1517.58 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయి నుంచి తగ్గకుండా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 1323.02 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీన జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన రాష్ట్రస్థాయి నాలుగో సాఫ్ట్ బేస్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పి. నిషాంత్, కే. మనోజ్‌కుమార్, కే. వైష్ణవి, జి. అక్షర ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో మహారాష్ట్రలోని షిరీడిలో నిర్వహించే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ మంజుల తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీలకు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర రాజధాని త్రివేండ్రంలో అక్టోబరు 11 నుంచి 14 వరకు జరిగిన 16వ సౌత్‌జోన్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర తరుపున యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట పవన్‌కుమార్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లోని యూత్ సబ్ యూత్ విభాగంలో ఆయన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సందీప్‌కుమార్ తెలిపారు. పవన్ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



పవన్‌కుమార్

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థిని



కనుకునిది చందన

గుండాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -14,17 బాలబాలికల పోటీల్లో గుండాల కస్తూర్బా పాఠశాలకు చెందిన కనుకునిది చందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో యాద'గిరి' ప్రదక్షిణ

● భక్తుల భజనలు, కీర్తనలు
● నరసింహ నామంతో ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం

యాదగిరిగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రం నమో నారసింహ కీర్తనలతో ప్రతిధ్వనించింది. బుధవారం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం, గిరిప్రదక్షిణ, కార్తీక వ్రతాలు జరిపించి దీపాలను వెలిగించారు. వైకుంఠద్వారం నుంచి సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. ఈ వేడుకలతో ఆధ్యాత్మిక శోభ రెట్టింపైంది. ఆలయంలో వేకువజాము నుంచి రాత్రి వరకు వివిధ పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ భజనలు, కీర్తనలతో కొండచుట్టు రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల పాటు హోరెత్తించారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు మెట్ల దారిలో కొండెక్కి. భక్తులకు 1,500 ఉచిత దర్శన టికెట్లు మాత్రమే అధికారులు పంపిణీ చేసి, ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలి రావడంతో వైకుంఠద్వారం (కూడలి) రోడ్లు నిండిపోగా వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రదక్షిణ మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 25వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. ఉభయ క్యూలైన్‌లో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగగా బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి మూడు గంటల పాటు వేచి ఉన్నారు. కొండకింద కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి కొంతమంది భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి, లక్ష్మీపుష్కరిణిలో పుణ్య స్నానాలు, సత్య దేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకోగా, దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, విప్ అయిలయ్య దంపతులు



గిరిప్రదక్షిణ సమయంలో నడుస్తున్న వాహనాలు

వేదాశీర్వచనం

ఆలయంలోకి ప్రవేశించిన ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు, కలెక్టర్ హనుమంతరావు కు ఆలయ మర్యాదలతో ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. కాగా, ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున వైకుంఠద్వారం చెంత శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్టు కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. యాదగిరిగుట్ట ఏసీపీ పి. శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్స్‌పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు బారికేడ్లతో బందోబస్తు నిర్వహించారు.

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మ నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం పూజారులు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనలు జరిపి ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108 కలశాలు ఏర్పరచి వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హవనం చేపట్టారు. ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అ లంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా యాద గిరిక్షేత్రంలో హరిహరులకు నిత్యపూజలు శాస్త్రో క్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ వి భాగాల ద్వారా రూ.20,79,254 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు.



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కార్తీక దీపారాధన

కాగా, వ్రత మండపాలు, పరిసర ప్రాంతాలను ఆలయ అధికారులు పరిశీలిస్తూ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం సందర్భంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. కొండపైన ఆలయం ఉత్తర రాజగోపురం ఎదుట, శివాలయం, విష్ణుపుష్కరిణీ, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారంతో కలిపి ఐదు ప్రదేశాల్లో టెండరుదారులు తగిన ఏర్పాటు చేయగా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

ఆరు విడతల్లో 175 వ్రతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుని కార్తీక వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రవేశంతో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోగా కొండపైన ఇష్టదైవాలను దర్శించుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఆరు విడతల్లో జరిగిన వ్రతాల్లో 175 జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నాయి. మొదటి విడత 36, రెండో విడత 67, మూడో విడత 33, నాలుగో విడత 23, ఐదో విడత 08, ఆరో విడత 08 వ్రతాలు జరిగినట్లు ఏఈవో జాటోతు శంకర్‌నాయక్ తెలిపారు. రూ.1,000 టికెట్టు పొందిన దంపతులకు వ్రత పూజ సామగ్రి, అవసరమయ్యే పాత్రలు అధికారులు అందజేశారు. కాగా, భక్తుల సౌకర్యార్థం కియోస్కో యంత్రాలు, మొబైల్ ఏటీఎం అధికారులు ఏర్పాటు చేశారు.



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్డు దాటాలంటే ప్రయాసే..



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులు, విద్యాలయాలతో పాటు వ్యాపార సంస్థలు చాలా ఉన్నాయి. వాటిని నిర్వహించే యజమానులు కనీస నిబంధనలు పాటించడం లేదు. రహదారులను ఆక్రమిస్తూ వ్యాపారం కొనసాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ వెనుక భాగంలో రహదారిపై నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్లతో వాహన దారులు పాట్లు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపివేయడంతో పాటు రోడ్డు మధ్యలో నిలబడి తినడం, డిస్పోజల్ ప్లేట్లు, గ్లాసులు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో అసౌకర్యం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

ఇబ్బంది పడుతున్న రోగులు

ఇరుకైన సందులతో కనీసం అంబులెన్స్ కూడా దూరలేని పరిస్థితి ఉన్న డాక్టర్స్ కాలనీలో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమీపంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల నాలుగైదు ప్రధాన ఆస్పత్రులు రెడ్డీకాలనీలో ప్రారంభించారు. రహదారులన్నీ ఇడ్లీబండ్లు, కర్రీ పాయింట్లతో నిండిపోవడంతో ఆయా ఆస్పత్రులకు రాలేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరతున్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు



రహదారులను ఆక్రమించుకుని వ్యాపారం చేయడం చట్టవిరుద్ధం. చిరువ్యాపారులైనా, పెద్ద వ్యాపారులైనా నిబంధనలు పాటిం చాలి. పట్టణ ప్రజలకు, వాహనదా రులకు అసౌకర్యం కలిగిస్తే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలను విక్రయించే వారు శుచి, శుభ్రత పాటించాలి, జాగ్రత్తలు పాటించకపోతే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుంది.

● శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

రోడ్డుపైకి చెట్ల కొమ్మలు.. వెళ్లేందుకు వాహనదారులు తంటాలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో పెరిగిన పచ్చదనం ప్రజలకు కొంత అసౌకర్యం కలిగిస్తోంది. టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదుగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పచ్చదనంతో అభివృద్ధి చేశారు. ఇరువైపులా పెరిగిన మొక్కలు, చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు విస్తరించడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పచ్చదనాన్ని పెంచి పోషించడం అవసరమే అయినప్పటికీ, మొక్కలకు ప్రూనింగ్ చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుపైకి వస్తున్న కొమ్మలు

నాణ్యత పాటించాలి

మోత్కూరు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్ నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆటోమెటిక్ ప్యాడి క్లినర్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం శుభ్ర పరిచే ప్రక్రియను గమనించారు. వరి తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సీఈవోకు సూచించారు. తేమ శాతం తగ్గే విధంగా, నాణ్యమైన ధాన్యం మార్కెట్‌కు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. రైతులు ఇబ్బంది పడకుండా, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, నాణ్యత పరిశీలన అధికారి గోపినాథ్, ఏఈవో సింహప్రసాద్, సీఈవో వరలక్ష్మీ, సెంటర్ ఇన్‌చార్జి సంధ్య, నాగేష్ పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్‌కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మోత్కూరు భారత్ గ్యాస్ గోదాం ఇన్‌చార్జి ఎస్.ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు తెల్లరేషన్‌కార్డు, కుటుంబసభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, 2పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఫోన్‌నెంబరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేరుగా గ్యాస్ కార్యాలయానికి వచ్చి ఈకెవైసీ చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మిమోసపోవద్దని తెలిపారు.

స్వచ్ఛందంగా రక్తదానం

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భువనగిరి జిల్లా ఆస్పత్రిలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. జిల్లా ఆస్పత్రి హెచ్‌వోడీ స్వరాజ్యం, బ్లడ్‌బ్యాంక్ అధికారి డాక్టర్ సుభాషిని మాట్లాడుతూ ఆరోగ్యవంతులందరూ బాధితుల ప్రాణాలను కాపాడేందుకు విధిగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమయ, డాక్టర్ ప్రసాద్, జిల్లా రెడ్‌క్రాస్ డైరెక్టర్ కోడారి వెంకటేష్, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది అలీ, సదానందం పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు

వలిగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రొద్దటూర్ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర సురమాంబదేవి బోనాల పండుగ బుధవారం వైభవంగా జరిగింది. గౌడ కులస్థుల ఆధ్వర్యంలో సంప్రదాయంగా బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొత్తకుండలో బోనం తయారుచేసి శివసత్తుల పూనకాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా తరలి వెళ్లి స్వామివారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పల్సం బాలయ్య, బచ్చుల లక్ష్మయ్య, రామస్వామి, ముత్తయ్య, శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌడ్, సాయిలు గౌడ్ నర్సింహ, విశ్వరూపం, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల పరిశీలన



ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

మోటకొండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మోటకొండూరు మండలంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలకు ఆర్డీవో కృష్ణారెడ్డి బుధవారం అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ భవనాలు తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీవో ఇందిర, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, జిల్లా నాయకులు కొంతం మోహన్‌రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, ఆర్ఐ ఆసిఫ్, లైసెన్స్‌డ్ సర్వేయర్లు మార్గం మహేష్, సాయి ప్రసాద్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకా వేయించాలి

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు తమ పశువులకు తప్పని సరిగా గాలికుంటు టీకా వేయించాలని యాదగిరిగుట్ట పశు వైద్యాధికారి శివరామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ప్రగతి, సిబ్బంది అశోక్, రేణుక, రాములు, రమేష్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి నరసింహారావు అన్నారు. బుధవారం గుట్టలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకుంటేనే కడుపులో పిండం బలిష్టంగా పెరుగుతుందని అన్నారు. బిడ్డ సంరక్షణ కోసం తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో రేఖల స్వరాజ్యం, సూపర్‌వైజర్ జంగమ్మ, అంగన్‌వాడీ టీచర్ వాణిశ్రీ, శోభారాణి, రమాదేవి ,ఆశావర్కర్, తల్లులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మోత్కూరు విద్యార్థులు

మోత్కూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి జూడో పోటీలలో మోత్కూరు హైస్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ అన్నపు వెంకట్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా స్థాయి జూడో పోటీలలో మోత్కూరు హైస్కూల్‌కు నుండి అండర్ 14 విభాగంలో (44 కేజీలు) కె.నిధి, (50 కేజీల) ఏ.సాయిసృజిత్‌చంద్ర ప్రథమ స్థానం , అండర్ 17 విభాగంలో (36 కేజీలు) ఎం.విమల శ్రీ, (52కేజీలు) ఎన్. సాక్షి లు ప్రథమ స్థానం, 45 కేజీల విభాగంలో ఎస్ కే పరహాన్, 50 కేజీల విభాగంలో పి.అర్జున్, 55 కేజీల విభాగంలో అవినాష్, 40 కేజీల విభాగంలో ఏ.రాకేష్ ద్వితీయస్థానంలో విజయం సాధించారు. వీరంత రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

కల్వర్టుపై గుంతలు..జర పైలం



కేవులతండ సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు



నాగాయపల్లి రోడ్డు కల్వర్టుపై గుంతలు

తుర్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం మాధాపూర్ - నాగాయపల్లి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాధాపూర్ నుంచి వయా కేవుల తండ నుంచి నాగాయపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాల పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నా రు. అంతే కాకుండా గ్రామంలోని పీఆర్ రోడ్డు నుంచి నాగాయపల్లి గ్రామానికి వెళ్లడానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుపై కల్వర్ట్ నిర్మించారు. కల్వర్టు కింది నుంచి వర్షం నీటితో పాటు కొండ పోచమ్మ ప్రాజెక్టు ద్వారా వచ్చే జలాలు పారుతాయి. గత వర్ష కాలంలో నీటి ఉధృతి కారణంగా కల్వర్ట్ దెబ్బ తిని కూలి గుంతలు పడింది. దీంతో వాహన దారులు రోడ్డుపై ప్రయాణిస్తున్నడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా రోడ్డుపై నాగాయపల్లి గ్రామస్థులతో పాటు యాదగిరిగుట్ట పరిసర గ్రామాల ప్రజలతో పాటు తుర్కపల్లి, మాధాపూర్, దత్తాయపల్లి, మల్కాపూర్, ధర్మా రం, గోల్లగూడెం తదితర గ్రామాల నుంచి ఎంతో మంది నిరుద్యోగులు కంపెనీల్లో పని చేయడానికి నిత్యం వందల మంది వెళ్తారు. కాబట్టి సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలేవీ?



ముత్తిరెడ్డిగూడెంలో శిథిలావస్థకు చేరిన జీపీ భవనం

- శిథిల భవనాలు, ఇరుకు గదులనుంచే పాలన
- కొన్నింటికి శంకుస్థాపనలు..
- నేటికీ ప్రారంభం కాని పనులు

మోటకొండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మోటకొండూరు మండలంలో నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. దీంతో పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటిహాళ్లలో కొనసాగుతున్నాయి. మండలంలోని ఆరెగూడెం, గిరబోయినగూడెం, సికిందర్‌నగర్, ముత్తిరెడ్డిగూడెం, కదిరేనిగూడెం గ్రామ పంచాయతీ భవనాల కోసం గత ప్రభుత్వం 2023లో ఒక్కో భవనానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరి చేసింది. ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపనలు కూడా చేశారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులుపడున్నారు. ఆరెగూడెంలో జీపీ కార్యాలయం లేకపోవడంతో అంగన్‌వాడీ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గిరబోయిన గూడెం జీపీ కార్యాలయం పాలకేంద్రంలో, సికిందర్‌నగర్ జీపీ కార్యాలయం ప్రైవేట్ పాఠశాలలో, ముత్తిరెడ్డిగూడెం జీపీ కార్యాలయం పాత ప్రాథమిక పాఠశాలలో, కదిరేనిగూడెం జీపీ కార్యాలయం ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇటీవల నూతనంగా ఏర్పడిన పెద్దబావి, అబీద్‌నగర్ జీపీ కార్యాలయాలు ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. ఇలా అన్ని నూతన గ్రామ పంచాయతీలు మూతబడిన ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి ఇతర భవనాల్లో కొన సా గు తున్నా అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి జీపీ పనులను వెంటనే ప్రారంభించి, జీపీ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులుడుతున్న ముత్తిరెడ్డిగూడెం జీపీ భవనం

- శిథిలావస్థలో జీపీ కార్యాలయం

నూతనంగా ఏర్పడిన ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 40 ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల కోసం ఈ భవానాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో జీపీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పెచ్చులుతున్నాయి. దీంతో అధికారులు భయం భయంగా పాలన కొనసాగిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులుడుతుండడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి శశిధర్‌రెడ్డి తెలిపారు.

జీపీ భవనాలను వెంటనే నిర్మించాలి



మాగ్రామం గతంలో నాంచారిపేట గ్రామంలో కలిసి ఉండేది. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో కదిరేనిగూడెం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. కానీ ఇప్పటి వరకు జీపీ కార్యాలయం లేకపోవడంతో మూతబడిన ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది. 2023లో అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి నూతన గ్రామపంచాయతీకి శంకుస్థాపన చేసి రూ. 20లక్షలు మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో జీపీ భవనాలు నిర్మించాలి..

-మహేశ్వర్, కదిరెనిగూడెం

పనులను ప్రారంభిస్తాం..



మోటకొండూరు మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి. కాని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జాప్యం జరిగింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోగానే జీపీ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటమన్నారు.

-శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ, మోటకొండూరు

కంటి వైద్యపరీక్షల నిర్వహణ అభినందనీయం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం, వేదికపై కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ చక్రవర్తిరెడ్డి

రామన్నపేట, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి దాతలు ముందుకొచ్చి అనేక గ్రామాల్లో కంటిచూపును అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రి డాక్టర్లతో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ వారి కుమారుడు వీరేందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలో సుమారుగా 14 గ్రామాలకు 8రోజుల పాటు నిర్వహించే ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ప్రారంభోత్సవం భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో కంటి చూపు సమస్య ఒకటని అన్నారు. కనీసం వైద్యం చేయించుకోవడానికి గ్రామీణ ప్రజల దగ్గర డబ్బులు లేక, కనీస అవగాహన లేక కంటి చూపు మందగించి, దీర్ఘకాలికంగా ఇబ్బం ది పడుతున్నారన్నారు. మానవత్వంతో ఇలాంటి దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ప్రజలందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) గుమ్మి చక్రవర్తిరెడ్డి, నిర్వాహకులు దేవిరెడ్డి పద్మవీరేందర్‌రెడ్డి. టాస్క్‌ఫోర్స్ చైర్మన్ సింగిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీడీ ఉపేందర్‌రెడ్డి, తహశీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో రాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు గుమ్మి గోపీనాథ్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి, వెంకటపాపిరెడ్డి, నర్మద, నిర్మల, అంజనమ్మ, శంకర్ నేత్రాలయ కోఆర్డినేటర్ భానుప్రకాష్, సభాధ్యక్షుడు తొలుపునూరి చంద్రశేఖర్, నిర్వాహకులు గాదె శోభారాణి, బొడ్డుపల్లి వెంకటేశం, గంటెపాక శివకుమార్, కట్ట యాదయ్య, మిర్యాల శ్యామ్‌సుందర్, మన్నెం పద్మారెడ్డి, తాళ్లపల్లి జితేందర్, ఉయ్యాల నర్సింహ, బాదె బిక్షం, జోగుల సాయికుమార్, ఉడుతల శ్రీనివాస్, చొల్లేటి ప్రభాకరాచారి, తొల్పునూరి భరత్, బత్తిని సందీప్, తుర్కపల్లి నరేష్, బొడ్డు మహేష్, జంపాల మహేష్, ఉయ్యాల సాయి పాల్గొన్నారు.

ఊర చెరువు కట్టను బలోపేతం చేయాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య



చెరువు కట్టను పరిశీలిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని ఊర చెరువు కట్టను బలోపేతం చేయాలని టీడీపీ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఊర చెరువు కట్ట ను బుధవారం బడుగు లక్ష్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ చౌటుప్పల్ చెరువు పైభాగంలోని దండు మల్కాపురం, కైతాపురం, లక్కారం చెరువులు నిండి అలుగు పోస్తున్నాయని, ఆయా చెరువుల అలుగు నీరు చౌటుప్పల్ చెరువులోకి ప్రవహిస్తోందని అన్నారు. ఊర చెరువు కట్ట కింది భాగంలో నివాస గృహాలు ఉన్నాయని, కట్ట లీకేజీ నీరు ఇళ్లలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కట్టతో పాటు చెరువు తూమును మరమ్మతులు చేయించాలని, ఇప్పటికే నిండి అలుగు పోస్తున్న లక్కారం, తంగడపల్లి చెరువుల తూముల నుంచి నీరు లీకేజీ జరుగుతుందని ఆయన అన్నారు. ఆయా చెరువుల కట్టల నుంచి కూడ చిన్న చిన్న లీకేజీ లు ఉన్నాయని ఆయన అన్నారు. చౌటుప్పల్ చెరువు తూంతో పాటు కట్టలో నెలకొన్న సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆయన కోరారు. చెరువు కట్టపై నుంచి వాహనాలు ఎదురెదురుగా వెళ్లే విధంగా విస్తరించాలని, దీంతో పట్టణంలోని ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్యగౌడ్, మండల ఉపాధ్యక్షుడు నల్ల పర్వతాలుయాదవ్, మారగోని అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశ్ గౌడ్, నాయకులు చిలువేరు రాజు, పిగోవిందా చారి, గుర్రం నర్సింహ, కృష్ణతేజ, చెరుకు అశోక్, కొయ్యడ నర్సింహ, కే.సంజయ్‌బాబు పాల్గొన్నారు. అంతకుముందు కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలి



జూలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్‌చైర్మన్ లింగంయాదవ్

భువనగిరి రూరల్, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, భూదాన్‌పోచంపల్లి, భూదాన్‌పోచంపల్లి, గుండాల అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. భారీ వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని భువనగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనుకుంట రేఖ బాబురావు కోరారు. ఐకేపీ ఆధ్వర్యంలో భువనగిరి మండలంలోని నందనం, బొల్లేపల్లి, నమాత్‌పల్లి, సూరేపల్లి, అనాజీపురం తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు.

- చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో మొదటి రోజు ఆరుగురు రైతులకు చెందిన 2100 బస్తాల ధాన్యాన్ని తూకం వేశారు.76 మంది రైతులు ధాన్యం రాశులు పోశారు. ధాన్యం తూకాలను ఏఎంసీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పరిశీలించారు.
- రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందా లని డీసీసీబీ మాజీ డైరెక్టర్, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్ అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో జూలూరు, అలీనగర్, కప్రాయిపల్లి, పెద్దరావులపల్లి, పిలాయిపల్లి, జగత్‌పల్లి, పెద్దగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు.
- తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్‌లు తెలిపారు. బుధవారం చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం, పెద్దకొండూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు.
- దళారుల చేతిలో మోసపోకుండా రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని గుండాల పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం అన్నారు. బుధవారం గుండాల మండలంలోని మర్రిపడగ, వస్తాకొండూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు.
- భువనగిరి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాడూరి నర్సింహ, చిన్నం శ్రీనివాస్, పిట్టల రజిత, రంగ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేష్, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పక్కీరు కొండలురెడ్డి, పాల్గొన్నారు.
- భూదాన్‌పోచంపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో చైర్మన్ లింగంయాదవ్, ఏవో శైలజ, రికార్డు అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సీఈవో రెబ్బాస్ నర్సింహ, డైరెక్టర్లు పాల్గొన్నారు. తహసీల్దార్ హరికృష్ణ, సీఈవో నాగయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత



భువనగిరి మండలం వీరవెల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

భువనగిరి రూరల్: బాధిత రైతు కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నట్లు చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన రైతు తోటకూరి లచ్చయ్య (85) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 30వేలు ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తోటకూరి శంకరయ్య, వెంకట్ రెడ్డి, నల్ల లక్ష్మీ, బ్యాంకు సీఈవో నల్లమాస రాములుగౌడ్, సిబ్బంది రాజు, సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

పాద పద్మార్చన సేవ



వేంకటేశ్వరస్వామికి పాదపద్మార్చన నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణగిరిలో వేంకటేశ్వరస్వామికి బుధవారం 108 బంగారు అష్టదళ పద్మపుష్పాలతో పాద పద్మార్చన సేవ నిర్వహించారు. సకలాభీష్ట సిద్ధికోసం సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. లక్ష్మీమండపంలో కార్తీక దామోదర హవనం నిర్వహించారు. స్వామి వారి నిత్యకల్యాణం నిర్వహించి కల్యాణమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ధ్వజస్తంభంపై ఆకాశదీపం వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించి అన్నప్రసాదం స్వీకరించారు.

అమ్మానాన్న ఆశ్రమం పరిశీలన

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని అమ్మానాన్న అనాథాశ్రమంలో మౌలిక సదుపాయాలను స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి బుధవారం పరిశీలించారు. ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, ఆహారానికి ఉపయోగించే సరుకులు, ఇతర సామగ్రిని జడ్జి పరిశీలించారు. కార్యక్రమంలో న్యా యవాది జక్కర్తి శేఖర్, కోర్టు సిబ్బంది ఉమర్ బిన్ నాజర్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరగకుండా, ప్రమాదాలు సంభవించినప్పుడు నష్టనివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ జీనియస్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించింది. క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం భువనగిరి అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులకు సిబ్బంది ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదాలపై సమయస్ఫూర్తితో వ్యవహరించాలని, మనోధైర్యం పాటించాలని సూచించారు. అగ్నిమాపకశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.స్వర్ణలత పాల్గొన్నారు.

వెంకటయ్య మృతి తీరని లోటు

మోత్కూరు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం సదర్శాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వరైపాటి వెంకటయ్య అకాల మరణం తీరని లోటని తెలంగాణ రాష్ట్ర పోలీసు కంప్లైంట్స్ అథారిటీ మెంబర్ వరై వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సదర్శాపూర్‌లో వెంకటయ్య భౌతికాయంపై పూల మాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటయ్య విద్యార్థి నాయకునిగా నీతి, నిజాయితీతో చురుకుగా పనిచేశారని అన్నారు. గ్రామాభివృద్ధికి కృషిచేసిన వెంకటయ్య మృతి తీరని లోటన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వలిగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన గోదాసు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

‘ఢీ’సీసీ

(5వ పేజీ తరువాయి): అనుబంధ కమిటీలను ఆశామాషీగా కాకుండా పార్టీలోని సీనియర్ నేతలై ఉండి, ఓ ప్రత్యేక స్థానంతో పాటు అందరిని సమన్వయం చేసుకునే నేతలకు పట్టం కట్టాని నిర్ణయించింది. ఈ సారి ఏఐసీసీ మార్గదర్శకాల ప్రకారం సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించిన వ్యక్తులను డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారా? లేక పార్టీలోని సీనియర్ నేతలకు అవకాశం కల్పిస్తారా? అనేది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అయితే జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు డీసీసీ ఎంపిక విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తికే డీసీసీ పగ్గాలు అప్పగించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలోని సీనియర్ నేతలతో కలిసి సదరు అభ్యర్థి అయితేనే బాగుంటుందనే అభిప్రాయాలను వెల్లడించాలని కోరుతున్నట్టు తెలిసింది. ఏఐసీసీ పరిశీలకుడి సమక్షంలో జరుగుతున్న అభిప్రాయ సేకరణ సందర్భంగా వారికి అనుకూలమైన వ్యక్తికి మాత్రమే మద్దతు తెలియజేయాలని మండ ల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు సూచిస్తున్నట్టు సమాచాం. స్థానిక ఎమ్మెల్యేను కాదని వేరే వారికి ఎలా మద్దతు చెబుతామని, వారు కూడా ఎమ్మెల్యేలు సూచించిన వ్యక్తికే తమ మద్దతు ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడికి వివరిస్తున్నారు. ఏఐసీసీ తొలిసారిగా పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించి, అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని డీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని చూస్తుండగా, జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా అభిప్రాయ సేకరణ సాగుతోందని పలువురు నేతలు విమర్శిస్తున్నారు.